ప్రజల ఆరోగ్యానికి రక్ష

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో సత్ఫలితాలు
- 14 రకాల వైద్య సేవలు
- 12 రకాల పరీక్షలు, ఉచితంగా మందులు అందజేత



ఇచ్ఛాపురం మున్సిపాలిటీ ఒకటో వార్డు పురుషోత్తపురంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఇచ్ఛాపురం: ప్రజా సంక్షేమమే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం. అన్నివర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందులో భాగంగా ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించారు. ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో రూపొందించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోంది. గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ప్రజలు సక్రమంగా సద్వినియోగం చేసుకుంటున్నారు. స్పెషలిస్టు వైద్యులు హాజరై రోగులకు వైద్య, రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నారు. 14 రకాలవైద్య సేవలతోపాటు 12 రకాల పరీక్షలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేదల వైద్యానికి ఎంతో భరోసానిస్తుంది. ఒక్క రూపాయి ఖర్చులేకుండా సీఎం జగన్ ప్రజల చెంతకే వైద్యసేవలు తీసుకురావడంతో హర్షం వ్యక్తమవుతోంది.

ప్రత్యేక వైద్యులతో సేవలు

ఆరోగ్యసురక్ష శిబిరంలో ప్రత్యేక వైద్యనిపుణులు రోగులను పరీక్షిస్తున్నారు. గైనిక్, చిన్నపిల్లలు, కంటి వైద్యులు, డెంటిస్టు వంటి ప్రత్యేక వైద్యులు హాజరై ప్రజలకు వైద్యం అందిస్తున్నారు. అలాగే శిబిరానికి వచ్చిన ప్రతిఒక్కరి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులు ప్రత్యేక శ్రద్ధతో తెలుసుకుంటున్నారు. అందుకు తగ్గట్టుగా పరీక్షలు, ఈసీజీ టెస్టులను నిర్వహించడంతోపాటు అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేస్తున్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకూ నాలుగు వైద్య శిబిరాలను నిర్వహించారు.



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో నిర్వహించిన వైద్యశిబిరాల వివరాలు

- మొదటి విడతలో నిర్వహించిన మూడు శిబిరాల్లో 1748 ఓపీలు వచ్చాయి. వీరిలో 1735 మందికి ఉచితంగా మందులు అందజేశారు. 34 మందికి ఈసీజీ పరీక్షలు, 1109 మందికి కంటిపరీక్షలు, 1695 మందికి రక్త పరీక్షలు చేశారు. 12 మందిని మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కి రిఫర్ చేశారు.
- రెండవ విడతలో ఇప్పటివరకు ఆరు శిబిరాలు నిర్వహించగా 2,663 ఓపీలు వచ్చాయి. వీరిలో 2,642 మందికి మందులు అందజేశారు. 23 మందికి ఈసీజీ పరీక్షలు, 1089 మందికి కంటి పరీక్షలు, 2,029 మందికి రక్తపరీక్షలు చేశారు.

ఆరోగ్యసురక్షతో మెరుగైన వైద్యం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. యూపీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఆరోగ్యసురక్ష శిబిరాలు నిర్వహించి పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నారు. ఇంటి వద్దకు సిబ్బంది వచ్చి వైద్య సేవలు అందిస్తుండడం సంతోషంగా ఉంది.

– పొట్నా శ్రీనివాసరావు,
7వ వార్డు, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ

ఈసేవలు నిరంతరం కొనసాగాలి



మాకు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే స్థోమత లేదు. గతంలో ఏదైన ఆరోగ్యసమస్య వస్తే చాలా ఇబ్బంది పడేవాళ్లమి. ఇటువంటి సమయంలో జగన్‌బాబు పుణ్యమాని వైద్యులు ఇంటి వద్దకే వచ్చివైద్య సేవలు అందించడంతోపాటు మందులు ఇస్తున్నారు. మా లాంటి పేదవారి కోసం ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగాలి.

–గంటా కుమారి,
పదవ వార్డు, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ

మంచి జరిగిందని నమ్మితే..
జగన్‌కు అండగా నిలవండి



పార్టీ శ్రేణులతో కలిసి సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న తిలక్, శ్రీనివాస్ తదితరులు

- వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటు, టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు తిలక్, శ్రీనివాస్
- చాకిపల్లిలో గ్రామ సచివాలయం ప్రారంభం

టెక్కలి: గతంలో ఎన్నడూ లేని విధంగా రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి నేరుగా సంక్షేమ పథకాలు అందజేశారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంచి జరిగిందని నమ్మితేనే మరో సారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ, టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పేరాడ తిలక్, దువ్వాడ శ్రీనివాస్ కోరారు. చాకిపల్లి గ్రామంలో గ్రామ సచివాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలుత తిలక్ మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకం కావాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల ఇళ్లల్లో ఊడిగం చేయాల్సిన దుస్థితి ఉండేదని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజకీయ నాయకుల జోక్యం లేకుండా కేవలం గ్రామవలంటీర్ సాయంతో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలందరికీ మంచి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ మాట్లాడుతూ.. ఇదే చాకిపల్లి పంచాయతీలో ఒకప్పుడు టీడీపీ నాయకులు ఎన్నో అక్రమాలకు పాల్పడి సామాన్యులను ఇబ్బందులకు గురిచేశారని గుర్తు చేశారు. కేవలం వారి స్వప్రయోజనాలతో నిధులు కాజేశారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత చాకిపల్లి సచివాలయం పరిధిలో సుమారు 17 కోట్ల రూపాయల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. గడచిన నాలుగున్నరేళ్ల కాలంలో ఎక్కడా కనిపించని అచ్చెన్నాయుడు ఈ రోజు మళ్లీ గ్రామాల్లో పర్యటిస్తూ ఓటు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈసారి మీ గ్రామం వస్తే తరిమికొట్టాలన్నారు. ఇదే గ్రామంలో గ్రామ సచివాలయం నిర్మాణం కోసం తాము కృషి చేస్తే టీడీపీ నాయకులు కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారన్నారు. అయితే ప్రజలకు మంచి చేయాలనే ఆశయం తమ నాయకుల్లో ఉందని.. అందుకే ఈ రోజు గ్రామసచివాలయం నిర్మాణం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వి.తవిటయ్య, ఎం.శంకర్, ఎంపీటీసీ సభ్యురాలు పి.దేవి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.దీప్తి, ఏఎంసీ మాజీ చైర్మన్ చుక్క గున్నమ్మ, వైస్ ఎంపీపీ ఎం.కిశోర్, సంతబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు పి.వసంతరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ఎస్.మోహన్, నాయకులు పి.శ్రీనివాస్, బి.బైరాగి, బి.భాస్కర్, వి.నారాయణ, డి.ప్రకాశ్, వి.అప్పన్న, సన్యాసిరావు, మౌళి, పావని, కె.సూర్యం, కె.రవికుమార్ గాంధీ, కె.అజయ్, పి.వైకుంఠరావు, టి.కిరణ్, బి.తులసీరావు, హెచ్.వెంకటేశ్వరరావు, బి.రామకృష్ణ, బి.ఢిల్లేశ్వరరావు, తిరుమలరెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

భవన నిర్మాణ కార్మికుల సంఘం కార్యవర్గం ఏర్పాటు



నూతన కార్యవర్గ ప్రతినిధులు

కంచిలి: పట్టణంలోని కంచమ్మతల్లి భవన నిర్మాణ కార్మికుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈ సంఘం 15 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా వార్షికోత్సవాన్ని ఆదివారం మండల కేంద్రం కంచిలిలో జరుపుకున్నారు. అధ్యక్షుడుగా పువ్వాల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడుగా కల్లా రంజిత్, కోశాధికారిగా బుడియా దుర్యోధరన్, కార్యదర్శులుగా కల్లా భగీరథి, పప్పు సింహాచలం, తాలాడ సాయికుమార్, బదిశెట్టి సింహాద్రిలను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇప్పిలి కృష్ణారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు హాజరయ్యారు.

నేడు పలు భవనాలు ప్రారంభం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సుమారు రూ. ఐదు కోట్లు వ్యయంతో నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలను మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం ప్రారంభిస్తారు. ఈ విషయాన్ని ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి, వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. పల్లిసారథి, డోకులపాడు, నగరంపల్లి, గుళ్లలపాడు, చినవంక గ్రామాల్లో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌లు, పాఠశాల భవనాలను మంత్రి ప్రారంభిస్తారన్నారు.

శివరాత్రి ఏర్పాట్లపై చర్చ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

కాశీబుగ్గ: సవరగోవిందపురంలోని స్వయంభూ లింగేశ్వర ఆలయం వద్ద వచ్చే నెల ఎనిమిదో తేదీన నిర్వహించనున్న శివరాత్రి ఉత్సవంపై కమిటీ సభ్యులు ఏర్పాట్లు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆదివారం సమావేశమయ్యారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా తీసుకోవాల్సిన చర్యలు అన్నదాన నిర్వహణ తదితర విషయాలపై చర్చించడంతోపాటు ఆలయ పరిసరాలను పరిశీలించారు. నిర్వాహక కమిటీలో ముఖ్యులు కొత్తపల్లి చిన్నాచారి ఆధ్వర్యంలో పలు అంశాలపై చర్చించుకున్నారు. అతిపెద్ద స్వయంభూ లింగం ఇదే కావడంతో పలాస, గొప్పిలి నుంచి వచ్చే భక్తులకు తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. కమిటీ సభ్యులతో పాటు సవరగోవిందపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

25న బొడ్డపాడు యువజన సంఘం 70వ వార్షికోత్సవం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పలాస/కాశీబుగ్గ: బొడ్డపాడు గ్రామంలో ఉన్నటువంటి బొడ్డపాడు యువజన సంఘం 70వ వార్షికోత్సవాన్ని ఈనెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్టు సంఘ సభ్యులు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను సంఘ భవనంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో జగదీశ్వర సంఘం అధ్యక్షుడు మద్దిల శంకరరావు చేతులమీదుగా ఆవిష్కరించి.. తొలి కరపత్రాన్ని బొడ్డు చిన్నారావు మాస్టారుకు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు తామాడ క్రాంతి, ఉపాధ్యాయుడు గుజ్జు దశరధరావు, కార్యదర్శి బొడ్డు జగన్, కోశాధికారి తామాడ గంగయ్య పాల్గొన్నారు.

22న జయమ్మ స్మారక సభ



ప్రచారంలో న్యూడెమోక్రసీ నాయకులు

సోంపేట: కామ్రేడ్ జయమ్మ నాలుగో వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళంలో ఈ నెల 22 వతారీఖున నిర్వహించే ఆమె స్మారక సభను విజయవంతం చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని బారువ, కొర్లాం, శాసనాం, లక్కవరం, సోంపేట గ్రామాల్లో ఆదివారం సమావేశాలు నిర్వహించి స్మారకసభపై ప్రచారం చేశారు. ప్రజాప్రతిఘటన పోరాటాలే జయమ్మకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. ప్రజా సంఘాల నాయకులు పోతనపల్లి కుసుమ, యన్.విజయ్‌కుమార్, రాపాక మాధవరావు, జె.అప్పయ్య, పోతనపల్లి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దువ్వాడ పరామర్శ



ముకుందరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్ తదితరులు



లక్ష్మణ్ నోహరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దేవదాస్‌రెడ్డి తదితరులు

కోటబొమ్మాళి: కొత్తపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ రాంపాత్ర్యుని ముకుందరెడ్డి ఇటీవల మృతి చెందారు. దీంతో అతని కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. ముకుందరెడ్డి పార్టీకి, గ్రామానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అయన చిత్రపటానికి నివాళులర్పించారు. ముకుందరెడ్డి భార్య సావిత్రి, సోదరుడు రంగారెడ్డి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పరామర్శలో పార్టీ మండల కన్వీనర్ నూక సత్తిరాజు, నాయకులు సుంకరి జనార్దనరావు, బమ్మిడి శ్రీనివాస్, కిల్లి అజయ్, మక్క నారాయణరావు ఉన్నారు.

ఎంపీపీ పరామర్శ..

కంచిలి: జలంత్రకోట గ్రామానికి చెందిన లక్ష్మణ్ నోహరి, డీజీ పురం గ్రామానికి చెందిన రిటైర్డు వీఆర్వో కర్తలి భీమారావు ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబాలను మండల అధ్యక్షుడు పైల దేవదాస్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, నాయకులు దుర్గాసి ధర్మారావు, ప్రకాష్ చంద్ర పండా ఉన్నారు.

ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి



ఆరోగ్యశ్రీకార్డు ఈకేవైసీ ప్రక్రియ పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

కవిటి: ఆరోగ్యశ్రీ యాప్‌ను లబ్ధిదారులు కచ్చితంగా డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్డీ శివాజీపాణిగ్రాహి అన్నారు. మండలంలోని వివిధ సచివాలయాల పరిధిలో ఆదివారం ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడింగ్ మొబైల్‌డ్రైవ్ విస్తృతంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆయా గ్రామాల్లో అధికారులు ఇద్దరూ ప్రత్యక్షంగా తనిఖీల్లో పర్యవేక్షించారు. మండలానికి 21,224 హౌస్‌హోల్డులు ఉండగా ఇప్పటి వరకు 20,229 ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో పేర్కొన్నారు. ఈకేవైసీ సకాలంలో చేసి యాప్‌డౌన్‌లోడింగ్ అంశంలో శతశాతం లక్ష్యాలు సాధించాలని గ్రామసచివాలయ సిబ్బంది, వలంటీర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కవిటి పంచాయతీ ఈవో జి.వీరభద్రస్వామి, వీఆర్వో సల్లా నారాయణ ఉన్నారు.

వాగ్గేయకారుల కీర్తనలపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న నాగేశ్వరరావు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న ఆరోహి సంగీత కళాశాల నిర్వాహకులు పెంకి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చిన్నారులకు వాగ్గేయకారుల కీర్తనల గానంపై శిక్షణ ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి ఒక గంట పాటు విద్యార్థులకు అన్నమయ్య, పురంధరదాసు, త్యాగరాజు, రామదాసు తదితరుల కీర్తనలపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. చేరాలనుకునే వారు 99897 63760 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

భక్తితో సామూహిక కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

గార: జొన్నలపాడు కాలనీలో రామమందిర ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. పురోహితులు దార్లపూడి కామేశ్వరశర్మ, బ్రహ్మశ్రీ ఆరవెల్లి బాలభాస్కర శర్మ, మావుడూరి మోహనశర్మల ఆధ్వర్యంలో సీతమ్మ తల్లి ప్రీతి కోసం మహిళలు కుంకుమార్చనలు చేశారు. ఉదయం ఆవాహిత హవనములు, సూర్యనమస్కారములు, మహన్యాసపూర్వక మహాలింగార్చనాదులు జరిగాయి. సోమవారం ఉదయం ప్రతిష్ట, దర్పణ, నిజరూప దర్శనం, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఉంటుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



చెత్తను ట్రాక్టర్‌లో వేస్తున్న కార్మికులు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మేజర్ పంచాయతీలో ఆదివారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ కాల్ల సంజీవరావు ఆధ్వర్యంలో మైన్‌రోడ్డు, కరణాలవీధి, ప్రకాష్‌నగర్‌కాలనీ, విద్యుత్‌నగర్, వైశ్యవీధుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి చెత్తను తొలగించారు. చెత్తను ట్రాక్టర్‌లో డంపింగ్ యార్డుకు తరలించారు.

20న వలంటీర్లకు వందనం

కాశీబుగ్గ: పలాస మండలం పరిధిలోని గ్రామ వలంటీర్లతో ఈనెల 20వ తేదీ ఉదయం పది గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మండల పరిషత్ కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన విడుదల అయ్యింది. మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద వేదికను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు వలంటీర్ల సేవలను బట్టి సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను అందజేస్తారన్నారు.

పారిశ్రామికవాడ అధ్యక్షుడికి సత్కారం



సత్కారం పొందుతున్న రామేశ్వరం

కాశీబుగ్గ: పలాస పారిశ్రామిక వాడ అధ్యక్షుడు మల్లా రామేశ్వరానికి విశాఖపట్నంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. శ్రీకృష్ణ మెడికల్ కళాశాలలో ఈ కార్యక్రమం జరిగింది. పలాస పారిశ్రామికవాడ పరిసర ప్రాంతంలో ఉన్నటువంటి 150 జీడి పరిశ్రమలు, వాటి పనితీరు, మార్కెటింగ్, ఇతర దేశాలకు ఎగుమతి వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మార్కెటింగ్‌లో మెలకవులు, కొత్త యువతరం మార్కెటింగ్‌లో ఎలా ఎదగాలో వివరించారు.

లింగాలవలసలో అమ్మవారికి చల్లదనం



గ్రామంలో సందడి చేస్తున్న భక్తులు

గార: అంపోలు పంచాయతీ లింగాలవలస గ్రామంలో మాఘ ఆదివారాన్ని పురస్కరించుకొని పాతపట్నం అమ్మవారికి గ్రామస్తులు చల్లదనం చేశారు. ప్రతీ ఇంటి నుంచి ముర్రాటలను తీసుకొని మహిళలు మంగళవాయిద్యాలు, భద్రకాళీ నృత్యప్రదర్శనలు మధ్య ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అర్హులందరికీ లబ్ధి



పింఛన్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న శర్వాణ గీత

కాశీబుగ్గ: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ లబ్ధి చేకూరిందని మున్సిపాలిటీ పదోవార్డు కౌన్సిలర్ శర్వాణ గీత అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో లబ్ధి చేకూరిందని నమ్మకం కలిగితేనే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఆదరించాలని కోరారు. పాందర వీధి, సెగిడి వీధి, కోవిల వీధి, పెంటవీధి, డెంకి వీధి, కొండి వీధిలో వలంటీర్లు, గృహ సారథులు, బూత్ కన్వీనర్‌లు, శక్తి కోఆర్డినేటర్లతో కలిసి ఆదివారం ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ఐదేళ్ల టీడీపీ పాలనకు ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు బేరీజు వేసుకోవాలని సూచించారు. నిరంతరం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్, మంత్రి సీదిరి అప్పలరాజులకు రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ చిత్తరెడ్డి, శ్రీనివాస్, శక్తి కోఆర్డినేటర్ మంజుల, వలంటీర్లు పురుషోత్తం పాత్రో, దివ్య అరుణ, లక్ష్మి, పార్వతి, కాజుల్ ఉన్నారు.

అలరించిన కోలాటం



నృత్యం చేస్తున్న మహిళా కళాకారులు

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టి ధనరాజుల తులసమ్మను ఆదివారం ఆంధ్రా, ఒడిశా ప్రాంతాలకు చెందిన భక్తులు ఆదివారం దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద కొజ్జిరి, భవానీపురం, లొద్దపుట్టి, సవరదేవిపేట, తేలుకుంచి, రొంపా ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి గజముద్దను సంబరంగా ఊరేగింపుగా తీసుకువచ్చారు. విశాఖపట్నం పెద్దగంట్యాడ ప్రాంతానికి చెందిన మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సినీ, భక్తి గీతాలకు మహిళలు చేసిన నృత్యం ఆహుతుల్ని అలరించింది.

జిల్లా చరిత్రను విద్యార్థులు తెలుసుకోవాలి

- రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్‌రావు



మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లాకు ఎంతో చరిత్ర, గుర్తింపు ఉందని.. నేటి తరం విద్యార్థులంతా ఆ చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు అన్నారు. శ్రీకాకుళం పీఎన్‌కాలనీలోని న్యూ సెంట్రల్ హైస్కూల్ వేదికగా జిల్లా పర్యాటక శాఖ, ఇంటాక్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లాలో ఉన్న చారిత్రాత్మక కట్టడాల గురించి చిత్రలేఖన పోటీలను ఆదివారం నిర్వహించారు. యువ టూరిజం క్లబ్ ద్వారా వివిధ కళాశాలల నుంచి హాజరైన విద్యార్థులు చక్కనైన చిత్రాలను గీసి ఆకట్టుకున్నారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిల్లోను పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు, కో–కన్వీనర్ రాధాప్రసాద్, న్యూసెంట్రల్ స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆదిత్యుడ్ని దర్శించుకున్న విశాఖ సిటీ పోలీస్ కమిషనర్



పోలీస్ కమిషనర్ రవిశంకర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో రమేష్‌బాబు

అరసవల్లి: మాఘ మాసం రెండో ఆదివారం సందర్భంగా పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారులు అరసవల్లి సూర్యనారాయణస్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈవో డి.ఎల్.వి.రమేష్‌బాబు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వారికి ప్రత్యేకంగా వేదాశీర్వచనాన్ని అందజేసి తీర్థప్రసాదాలను స్వామివారిని విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ తొలిసారిగా ఆదిత్యుడ్ని దర్శించుకున్నారు. ఆలయ విశిష్టతను ఆయనకు శంకర శర్మ వివరించారు. ఈయన వెంట బెహరా గిరిపట్నాయక్ తదితరులున్నారు. అలాగే విజయవాడ టెలికాం సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం కూడా తొలిసారిగా స్వామివారిని దర్శించుకున్నారు. సౌత్‌సెంట్రల్ రైల్వే ఉన్నతాధికారి, ఐఆర్ఎస్ అధికారి ఉన్నం అక్కిరెడ్డి కూడా ఆదిత్యున్ని దర్శించుకొని పూజలు చేశారు. వీరికి ఆలయ ఈవో డిఎల్‌వి రమేష్‌బాబు, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు.